
సాక్షి ఒడిశా

గురువారం । 11 । జనవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.3,81,186
బంగారం	350 మిల్లీ గ్రాములు
వెండి	137 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



రాష్ట్రంలో సుస్థిర పాలన

రాష్ట్రంలో గత రెండు దశాబ్దాలుగా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సుస్థిరమైన పాలన అందిస్తున్నారని మంత్రి అతున్ సవ్యసాచి నాయక్ అన్నారు.

- 8లో▸



గుర్తు తెలియని వ్యక్తుల దాడి

రాయగడ జిల్లాలోని కాసీపూర్ సమితి కొంటొమాల్ గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని కొంతమంది వ్యక్తులు దాడికి పాల్పడ్డారు.

- 8లో▸

న్యూస్‌రీల్

'ఎలుగుబంట్లును కవ్వించొద్దు'



ప్రజలను అప్రమత్తం చేస్తున్న అటవీ సిబ్బంది

జయపురం: స్థానిక అటవీ ప్రాంతంలో ఇటీవల విరివిగా సంచరిస్తున్న నాలుగు ఎలుగుబంట్లను ప్రజలు కవ్వించవద్దని అటవీ శాఖ అధికారులు సూచించారు. ఎలుగుబంట్లు నుంచి ప్రజలు, పంటలకు రక్షణ కల్పించేందుకు సిబ్బంది మంగళవారం హడియ, అంబాగుడ, పుట్ర, సిందిగాం, ముండపాదర్ గ్రామాల్లో ఫారెస్టర్ అరుణకుమార్ జెన నేతృత్వంలో పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను అప్రమత్తం చేశారు. ఎలుగులు కనిపిస్తే రాళ్లు, కర్రలు విసరవద్దని హెచ్చరించారు. ఎటువంటి సమస్య ఎదురైనా వెంటనే తెలియజేయాలని సూచించారు. అయితే చెరుకు పంటలను తినేందుకు అవి తరచూ వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

ఘాట్ రోడ్డులో ట్రక్ బోల్తా

● 300 కోళ్లు మృతి



బోల్తాపడిన ట్రక్

బరంపురం: నగరానికి సమీపంలోని తుంబా అటవీ ప్రాంతం ఘాట్ రోడ్డులో కోళ్లతో వెళ్తున్న ట్రక్ బుధవారం బోల్తాపడింది. ఈ ఘటనలో ట్రక్‌లో ఉన్నటువంటి 300 కోళ్లు మృతి చెందాయి. సమాచారం అందుకున్న జిల్లా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. కె.నువగాం పోలీసుస్టేషన్ పరిధి తుంబా సరుగుని జంగల్ ఘాట్ రోడ్డు నుంచి గజపతికి వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలియజేశారు.

జాతీయ సైన్స్ ప్రదర్శనకు ఎంపిక



గైడ్ టీచర్ మధుస్మితతో విద్యార్థిని రేణుశ్రీ

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని గుసాని సమితి కోర్సండ గ్రామంలో ఉన్న రాజీవ్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థిని జి.రేణుశ్రీ తయారుచేసిన 'మహిళలు ధరించే రక్షణ సాధనం' ప్రాజెక్టు కోల్‌కతాలో జరగనున్న జాతీయ సైన్సు ప్రదర్శనకు ఎంపికైంది. మయూర్‌భంజ్ జిల్లా బరిపద సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఇటీవల ప్రాజెక్టు ప్రదర్శించారు. దీనిపై జిల్లా ముఖ్య శిక్షాధికారి ప్రదోష్‌కుమార్ నాయక్, జిల్లా సైన్స్ కో–ఆర్డినేటర్ అంపోలు రవికుమార్, రాంప్రసాద్‌లు హర్షం వ్యక్తం చేశారు. డీఈవో నాయక్ ఆదేశాల మేరకు జి.రేణుశ్రీ తన గైడ్ టీచర్ మధుస్మితా త్రిపాఠితో కోల్‌కతా వెళ్లింది.

గణతంత్ర వేడుకలకు ఆహ్వానాలు

భువనేశ్వర్: ఈ ఏడాది గణతంత్ర వేడుకలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎవై) లబ్ధిదారులు ప్రత్యేక అతిథులుగా హాజరు కానున్నారు. దీనికోసం ఢిల్లీ నుంచి పిలుపు వచ్చింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కర్తవ్య పథ్‌లో నిర్వహించే వేడుకల్లో పీఎవై లబ్ధిదారులు అతిథులుగా హాజరుకానున్నారు. ఈ మేరకు కేంద్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది. నోడల్ అధికారి 25వ తేదీ ఉదయానికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన లబ్ధిదారులతో కలిసి ఢిల్లీకి చేరుకోవాలని లేఖలో కోరారు. 25న ఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రితో కలిసి లబ్ధిదారులు విందులో పాల్గొంటారు. మర్నాడు 26న ప్రధానమంత్రి ఆవాస్ యోజన లబ్ధిదారులు కర్తవ్య పథ్ కవాతు కార్యక్రమం ప్రత్యక్షంగా తిలకిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కేంద్ర ప్రభుత్వం రాసిన లేఖలో ఎంతమంది లబ్ధిదారులు ఇతరేతర వివరాలు, మార్గదర్శకాలు ఈ లేఖలో స్పష్టం చేయనట్లు సమాచారం.





విహంగ సోయగం.. ప్రకృతి పరవశం



పక్షుల లెక్కింపు ప్రక్రియ చేపడుతున్న అటవీ అధికారులు





ఈ ఏడాది 28 వేల విదేశీ పక్షుల రాక * లెక్కింపు పూర్తి చేసిన అధికారులు

బరంపురం అటవీ డివిజన్ పరిధి బాహుదా నదీతీరంలో ఈ ఏడాది తొలిసారిగా విదేశీ పక్షులు సందడి చేస్తున్నాయి. ఆసియాలో అతి పెద్దదైన చిలికా సరస్సులోని 24 దీవుల్లో రికార్డు స్థాయిలో సుమారు 185 జాతులకి చెందిన 10 లక్షలకు పైగా పక్షులు విడిది ఏర్పరుచుకున్నాయి. దీంతో అక్కడ విడిది స్థలం లేకపోవడంతో తొలిసారిగా బాహుదా తీరంలో తమజాతి పక్షులతో జత కడుతూ విదేశీ పక్షులు కనువిందు చేస్తున్నాయి. దీంతో ఇక్కడికి విచ్చేసిన పక్షుల లెక్కింపు ప్రక్రియను అధికారులు బుధవారం పూర్తి చేశారు. మొత్తం ఈ ఏడాది దాదాపు 28 వేల విదేశీ పక్షులు ఇక్కడ విడిది చేసినట్లు వెల్లడించారు. దీంతో వీటికి రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని డీఎఫ్‌వో అముల్యా కుమార్ ప్రధాన్ తెలియజేశారు. – బరంపురం







పథకాలను ఆదివాసీలు ఉపయోగించుకోవాలి



మాట్లాడుతున్న గవర్నర్ రఘుబర్‌దాస్

● గవర్నర్ రఘుబర్ దాస్
● సెంచూరియన్ వర్సిటీలో మత్స్య సంపద జాగృతి అభియాన్ ప్రారంభం

పర్లాకిమిడి: ఆదివాసీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న పథకాలను వినియోగించుకోవాలని రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్ సూచించారు. గజపతి జిల్లాలోని గుసాని సమితి ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీలో మత్స్య సంపద జాగృతి అభియాన్ కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. ఆయనకు వర్సిటీ రిజిస్ట్రార్ డా.అనితా పాత్రో, స్వామినాథన్ అగ్రికల్చర్ కళాశాల డీన్ దేవేందర్ రెడ్డి, డా.ఎస్పీ నందా, డిప్యూటీ రిజిస్ట్రార్ డా.పాఢి, డా.గిరీష్ మహంతి తదితరులు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. గజపతి జిల్లాలో రైతులు, మత్స్యకారులు వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఫసల్ బీమా యోజనలో నమోదు చేసుకుంటే, పంట నష్టపోతే పరిహారం లభిస్తుందని తెలియజేశారు. ప్రధానమంత్రి ముంజ్ యోజన పథకం, ఎల్‌పీజీ ఉచిత గ్యాస్ సిలెండర్లు ఎంతమంది మహిళలకు లభిస్తున్నాయో ఆరా తీశారు. అనంతరం వర్సిటీ వ్యవసాయ కళాశాలలో పుట్టగొడుగుల ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు. తర్వాత ఆయన నేరుగా పర్లాకిమిడి సర్క్యూట్ హౌస్‌కు చేరుకుని లంచ్ అనంతరం గుమ్మా బ్లాక్ పద్మపురంలో మహిళా గ్రూపులతో మాట్లాడారు. ఆయనతో పాటు కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి డా.గుణనిధి నాయక్, సెంచూరియన్ వర్సిటీ వెటర్నరీ అధికారి గిరీష్ మహంతి తదితరులు ఉన్నారు.

బె'ధర'గొడుతున్నాయ్..!


● అమాంతం పెరిగిన కూరగాయల ధరలు



బరంపురం: రాష్ట్రంలో ఒక వైపు చలి, మరోవైపు అమాంతం పెరిగిన కూరగాయల ధరలు సామన్య ప్రజలను హడలెత్తిస్తున్నాయి. వ్యవసాయ రంగంలో గ్రీన్ బెల్ట్‌గా పేరొందిన గంజాం జిల్లాలో ప్రస్తుతం కూరగాయల ఉత్పత్తి తగ్గిన కారణంగా ఒక్కసారిగా ధరలు పెరిగిపోయాయి. ఇటీవల కురుస్తున్న మంచు ప్రభావంతో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో జిల్లాలో కూరగాయల ఉత్పత్త పూర్తిగా పడిపోయింది. కొద్ది మోతాదులో పండుతున్న కూరగాయలు మార్కెట్‌లోకి వచ్చేసరికి ధరలు అకాశాన్ని తాకుతున్నాయి. ప్రస్తుతం బరంపురం మార్కెట్‌లో ఒక అరటి కాయ ధర రూ.10 – రూ.15 వరకు, పచ్చిమిర్చి ధర కిలో రూ.100లుగా ఉంది. అలాగే వంకాయలు కిలో రూ.70లు, బెండకాయలు కిలో రూ.70లు, టమాటా కిలో రూ.50లు, బీరకాయలు కిలో రూ.50లు, క్యాబేజీ కిలో రూ.50లుగా ఉన్నాయి. దీంతో ఎటువంటి కూరగాయలు చూసినా కిలో రూ.40లకు తగ్గడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గంజి నుంచి స్వచ్ఛమైన నీరు

● శ్రీమందిరం దక్షిణ ద్వారం వద్ద గంజి శుద్ధి కర్మాగారం



భువనేశ్వర్: శ్రీమందిరం ప్రాకార పథకంతో దీర్ఘకాలంగా తాండవిస్తున్న అనేక సమస్యలు పరిష్కారమవుతున్నాయి. శ్రీమందిరం పోటు (పాకశాల) నుంచి రోజూ విడుదలవుతున్న వందలాది లీటర్ల గంజి పెద్ద సమస్య. శ్రీమందిరం ప్రాకార పథకం కింద ఈ సమస్య పరిష్కృతం కానుంది. మందిరం దక్షిణ ద్వారం దగ్గర గంజి శుద్ధి కర్మాగారం (ట్రీట్‌మెంట్ ప్లాంట్)ను ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్‌లో శ్రీ మందిరం పోటు నుంచి నిత్యం విడుదలయ్యే గంజిని శుద్ధపరిచి నీటిని పునరుత్పత్తి చేస్తారు. శుద్ధి కర్మాగారంలోని కొన్ని ప్రక్రియల ద్వారా గంజి స్వచ్ఛమైన నీరుగా మార్చబడుతుంది. ఈ నీటిని తోటల పెంపకం నుంచి వివిధ అవసరాలకు ఉపయోగించవచ్చు. దీనివలన గంజి నుంచి పర్యావరణంపై ప్రతికూల ప్రభావం తగ్గుతుంది. ఈ ప్లాంట్ కోసం దాదాపు రూ.3 కోట్లు ఖర్చు చేశారు. ప్లాంట్ ట్రయల్ విజయవంతమైంది. శ్రీమందిరం ప్రాకార పథకం లోకార్పణ తర్వాత ప్లాంట్ పూర్తి స్థాయిలో పని చేస్తుంది. అన్ని యంత్రాల అమరిక పూర్తి అయింది. ప్లాంట్ హౌస్ నిర్మాణం దాదాపు చివరి దశకు చేరుకుంది. ఈనెల 17వ తేదీలోగా అన్ని పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒడిశా వంతెన నిర్మాణ సంస్థ (ఓబీసీసీ) ఇంజినీర్ ప్రభాత్ పాణిగ్రాహి సమాచారం ప్రకారం శ్రీమందిర్ పోటు నుంచి వచ్చే గంజి భూగర్భ మార్గం ద్వారా ప్లాంట్‌కు చేరుతుంది. వివిధ ప్రక్రియల్లో గంజి శుద్ధి చేసి వ్యర్థ ఘనపదార్థాలు తొలగిస్తారు.

ఒబొధా అనగా..?

శ్రీమందిరం రత్న వేదికపై కొలువుదీరి నిత్య సేవాదులు అందుకుంటున్న మూల విరాటులకు నివేదించే అన్న ప్రసాదాలను ఒబొధాగా వ్యవహరిస్తారు. అన్నం, పప్పు, పలు రకాల కూరలు వండి వార్చి స్వామివారికి నివేదిస్తారు. ఈ నేపథ్యంలో విడుదలయ్యే గంజి ఇతరేతర ద్రవ పదార్థాలను శుద్ధి చేసి పరిశుభ్రమైన నీటిని వేరు చేయనున్నారు. శ్రీ మందిరం ప్రాకార పథకం లోకార్పణ మహోత్సవం తర్వాత ఈ ప్రక్రియ పూర్తి స్థాయిలో ప్రారంభించాలని యోచిస్తున్నారు.

నకిలీ మద్యం బాటిళ్లు సీజ్



అరెస్టైన నిందితులు, నకిలీ మద్యం బాటిళ్లు చూపిస్తున్న అధికారులు

బరంపురం: బరంపురం – ఛత్రపూర్ మధ్య రహదారిలోని గ్రామంలో ఎక్సైజ్ అధికారులు దాడుల చేపట్టి నకిలీ మద్యం బాటిళ్లను బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ అధికారి గీతాంజలి సాహు తెలిపిన వివరాల మేరకు.. జిల్లాలో చమ్మఖండి పోలీసుస్టేషన్ పరిధి బొనుగునాపల్లి గ్రామంలోని ఒక ఇంటిలో నకిలీ మద్యం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో బరంపురం ఎక్సైజ్ అధికారులు దాడులు చేపట్టి నకిలీ మద్యం బాటిళ్లు, లేబుల్స్ సీజ్ చేశారు. అలాగే ఇద్దరు నిందితులను అరెస్టు చేయడంతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సై

● కాంగ్రెస్ ముందస్తు కసరత్తు
● 70 మంది అభ్యర్థులు ఖరారు..?

భువనేశ్వర్: ఈ ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు కాంగ్రెస్ ముందస్తు కసరత్తుతో సిద్ధమవుతోంది. ఈ మేరకు అభ్యర్థుల జాబితాలో తలమునకలై ఉంది. రేపో మాపో నోటిఫికేషన్ జారీ అవుతుందనే ఉత్కంఠ మధ్య రాష్ట్ర కాంగ్రెస్ శాసనసభ ఎన్నికల్లో పోటీకి తమ పార్టీ అభ్యర్థుల జాబితా ఖరారు చేయడం ప్రారంభించింది. సుమారు సగం శాసనసభ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితా సిద్ధమైనట్లు సమాచారం. ఇప్పటికే ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ దాదాపు 70 మంది అభ్యర్థుల పేర్లను ఖరారు చేసినట్లు ఆ పార్టీ సీనియర్ నాయకుడు తారాప్రసాద్ బాహిణీపతి తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల సమయం మాత్రమే ఉన్నందున అభ్యర్థులను ఖరారు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రచారానికి సన్నద్ధం కావడానికి కార్యకర్తలు, మద్దతుదారులను సమీకరించడానికి పార్టీ కొంతమంది అభ్యర్థులను ప్రకటించిందని ఆయన మీడియాకు తెలిపారు.

ఫిబ్రవరిలో టికెట్ల ప్రకటన

అంచెలంచెలుగా అభ్యర్థుల జాబితా ఖరారు చేస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ ఫిబ్రవరిలో టిక్కెట్ల ప్రకటన ప్రారంభిస్తుందని ఎమ్మెల్యే తారాప్రసాద్ తెలిపారు. ప్రజాదరణ, గెలుపు అవకాశాలు ప్రామాణికంగా పార్టీ టిక్కెట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు. దీని కోసం నియోజకవర్గాల్లో సర్వే నిర్వహించారు. ఈ నివేదిక ఆధారంగా ఆయా ప్రాంతాల్లో అభ్యర్థుల్ని ఖరారు చేసి టికెట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర కాంగ్రెస్‌కు శాసనసభలో 9 మంది సభ్యుల బలం ఉంది. వీరందరికి ఈ ఏడాది జరగనున్న ఎన్నికల్లో టికెట్లు కేటాయించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

బీజేడీని గద్దె దించడమే లక్ష్యం

దీర్ఘకాల పాలనలో రాష్ట్ర ప్రజలను సంతృప్తి పరచలేకపోయిన అధికార బిజూ జనతా దళ్‌ని గద్దె దింపడమే లక్ష్యమని ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి పేర్కొన్నారు. పార్టీ అట్టడుగు నుంచి అత్యున్నత స్థాయి వరకు అన్ని శ్రేణుల కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. పార్టీలో అంతః కలహాలకు అతీతంగా గెలుపు లక్ష్యంతో వివాదాలు తొలగించుకుని ఉమ్మడిగా ఉద్యమించనున్నట్లు వివరించారు. ప్రజా పాలనలో మనస్పర్థలతో పాలన విలువలు దిగజార్చడం ఎంత మాత్రం సబబు కాదని హితవు పలికారు. కొద్ది రోజుల్లో పలువురు రాజకీయ ప్రముఖులు కాంగ్రెసు పార్టీలో చేరనున్నారన్నారు. వచ్చే నెలలో రాహుల్ గాంధీ రాష్ట్ర పర్యటన పురస్కరించుకుని వీరంతా కాంగ్రెస్‌లో చేరతారని ఎమ్మెల్యే సూచనప్రాయంగా తెలిపారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరొకరికి తీవ్రగాయాలు



కల్వర్టులోకి దూసుకుపోయిన బైక్

భువనేశ్వర్: దట్టమైన పొగమంచు ఒకరి ప్రాణాలను బలిగొంది. పూరీ జిల్లాలోని పిప్పిలి - దొండొముకుందొపూర్ రోడ్డులోని ఖొండియాగిరి వద్ద మంగళవారం అర్ధరాత్రి ఈ దుర్ఘటన సంభవించింది. దట్టమైన పొగ మంచు కారణంగా ద్విచక్ర వాహనం దారితప్పి కల్వర్టును ఢీకొని 30 అడుగుల లోతున పడినట్లు తెలుస్తోంది. బైక్ ప్రమాదానికి గురవ్వడంతో వచ్చిన భారీ శబ్దంతో గ్రామస్తులు వచ్చి పరిస్థితిని పరిశీలించగా విషయం బయట పడింది. ఈ సమాచారం అందజేయడంతో అగ్నిమాపక దళం ఘటన స్థలానికి చేరుకొని ప్రాణాపాయ పరిస్థితుల్లో పడి ఉన్న బాధితుడిని చికిత్స కోసం పిప్పిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఉన్నత చికిత్స కోసం భువనేశ్వర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ బాధితుడి పరిస్థితి విషమించడంతో కటక్ ఎస్సీబీ వైద్య బోధన ఆస్పత్రిలో చేర్చారు. అయితే బుధవారం ఉదయం పరిశీలించగా ఈ పరిసరాల్లో మరొక వ్యక్తి మృతి చెంది పడి ఉన్నట్లు గ్రామస్తుల దృష్టికి వచ్చింది. మృతదేహం పరిశీలనలో ఆధార్ కార్డు లభించింది. దీని ఆధారంగా ఆచూకీ కోసం దర్యాప్తు బృందం విచారణ చేపట్టింది. ఆధార్ కార్డు ప్రకారం ఆయన నయాగడ్ జిల్లా బొణియా ప్రాంతీయుడిగా తెలుస్తోంది. భువనేశ్వర్ నుంచి పూరీ వెళ్తుండగా బైక్ ప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది.

సాగునీరు విడుదల



సాగునీరు విడిచిపెడుతున్న దృశ్యం

జయపురం: రబీ సీజన్‌కు సంబంధించి పంటలకు అప్పర్ కొలాబ్ సాగునీటి కెనాల్ నుంచి బుధవారం సాగునీరు విడుదల చేశారు. దీని వలన జయపురం సబ్ డివిజన్ జయపురం, బొరిగుమ్మ, కొట్‌పాడ్, కుంద్ర సమితుల్లో 25,700 హెక్టార్లలో భూములకు సాగునీరు అందుతుందని అధికారులు తెలియజేశారు. వాస్తవానికి ఈనెల 1వ తేదీ నుంచి నీరు విడిచిపెట్టాల్సి ఉన్నా, మరమ్మతులు వలన ఆలస్యమైనట్లు వెల్లడించారు. సాగునీరు విడుదల చేసేందుకు, విద్యుత్ ఉత్పాదన పెంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సీజన్‌లో మొదటిసారిగా పద్మపూర్ కెనాల్‌లోని సాగునీరు విడిచిపెట్టగా, ఇప్పుడు అప్పర్ కొలాబ్‌లో నీరు విడిచిపెట్టారు.

లొంగిపోయిన మహిళా మావోయిస్టు



లొంగిపోయిన ఉంగికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ వాద్వానీ

మల్కన్‌గిరి: జిల్లా ఎస్పీ నితీష్ వాద్వానీ ఎదుట మహిళా మావోయిస్టు స్వచ్ఛందంగా బుధవారం లొంగిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. మహిళా మావోయిస్టు ఉంగి మాడ్వీ చత్తీష్‌గడ్ దళంలో 2016 సంవత్సరంలో చేరింది. ఆమె దళంలో అంచెలంచెలుగా ఎదిగి దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలిగా నియమితమయ్యింది. అయితే ప్రస్తుతం బీఎస్ఎఫ్ బలగాలు మల్కన్‌గిరి మత్తిలి సమితి మొహిపోదర్, టీమురుపల్లి, తులసి పహడ్ వద్ద క్యాంప్‌లు పెట్టడంతో మావోల ప్రాబల్యం తగ్గింది. అలాగే అక్కడ శరవేగంగా అభివృద్ధి జరుగుతుండడంతో తనను దళంలో చిన్నచూపు చూస్తున్నారని ఆమె పేర్కొంది. దీంతో తాను లొంగిపోతున్నట్లు వెల్లడించారు. అయితే లొంగిపోయిన మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున అందాల్సిన పథకాలు త్వరగా వచ్చేలా కృషి చేస్తామని ఎస్పీ వెల్లడించారు.

బీజేపీ మిశ్రణ పర్వ్ సమావేశం

జయపురం: జయపురం నియోజకవర్గం పరిధి బొరిగుమ్మలో బీజేపీ బంధుమిలన్, మిశ్రణ పర్వ్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. బీజేపీ నేత హిమాంశు మహాపాత్రో నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో బొరిగుమ్మ సమితి గ్రామాల నుంచి అనేక మంది కార్యకర్తలు పాల్గొన్నారు. అంతేకాకుండా కొంతమంది యువకులు బీజేపీలో చేరారు. దీనిలో భాగంగా వివిధ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా హిమాంశు మహాపాత్రో మాట్లాడుతూ.. కార్యకర్తలు క్షేత్రస్థాయి నుంచి ప్రజలతో కలిసి సమస్యలను తెలుసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలు సమితి స్థాయిలో పరిష్కారం కాకపోతే వాటిని తమ దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా బీజేపీ సాధారణ కార్యదర్శి చంద్రశేఖర రథ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సుస్థిర పాలన

- మంత్రి అతున్ సవ్యసాచి నాయక్
- రాయగడలో నువా–ఓ–ఫెస్ట్



అభివాదం చేస్తున్న మంత్రులు అతున్, సరకలు

రాయగడ: రాష్ట్రంలో గత రెండు దశాబ్ధాలుగా సుస్థిరమైన పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, ఒడిశాను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి అతున్ సవ్యసాచి నాయక్ అన్నారు. స్థానిక బారిజోల వద్ద నున్న జీఏసీఆర్ మైదానంలో జిల్లా యంత్రాంగం నువా–ఓ–ఫెస్ట్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతోందని తెలియజేశారు. రాష్ట్రంలోని ఖనిజ, ప్రాకృతిక వనరులను సద్వినియోగ పరుచుకునేలా పరిశ్రమలను ఆహ్వానిస్తోందన్నారు. ఇప్పటికే ఎన్నో బృహత్తర పరిశ్రమలు రాష్ట్రంలో ఏర్పాటయ్యాయని, త్వరలో మరికొన్ని పరిశ్రమల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని వివరించారు. పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం యువత కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలని సూచించారు.

యువత పాత్ర కీలకం

రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే యువత పాత్ర చాలా కీలకమని మంత్రి నాయక్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా యువత రాజకీయాల్లో రాణించాలని ఆకాంక్షించారు. వారి భావనలకు అనుగుణంగా రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. చదువుతో పాటు విద్యార్థులు ఆసక్తి కనబరిచే అంశంపై పట్టుదలతో పని చేస్తే వారి గమ్యానికి మార్గం సుగమమవుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత చైతన్యవంతులవ్వాలన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి అతున్, కలెక్టర్ సింగ్‌లు



వేదికపై ప్రసంగిస్తున్న మంత్రి అతున్ పక్కనే అతిథులు

వ్యవసాయ రంగంలో అగ్రస్థానం

వ్యవసాయ రంగంలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రం ధాన్యం ఉత్పత్తుల్లో అత్యున్నత స్థానాన్ని సంపాదించుకుందని తెలియజేశారు. అలాగే క్రీడా రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెలియజేశారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తగు చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం అందుకు అనుగుణంగా ఇన్‌డోర్, అవుట్ డోర్ స్టేడియాల నిర్మాణాలతో పాటు క్రీడా పరికరాలను సమకూర్చగలుగుతుందన్నారు. రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక మాట్లాడుతూ.. యువతను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నువా–ఓ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. గిరిజన జిల్లాల్లో స్పెషల్ డవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎస్‌డీసీ) సంస్థ ద్వారా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అభివృద్ధికి సహకరిస్తోందని తెలియజేశారు. రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగోలు మాట్లాడుతూ రాష్ట్రంలో మిల్లెట్ మిషన్ పథకం మంచి సత్ఫలితాలు ఇచ్చిందన్నారు. కలెక్టర్ స్వాదాదేవ్ సింగ్ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అమో ఒడిశా నువా ఒడిశా జిల్లా కన్వీనర్ పట్నాణ గౌరి శంకర్, బిజూ స్వస్థ్య కల్యాణ సమితి రాష్ట్ర శాఖ ముఖ్యసలహాదారుడు సుధీర్ దాస్, ఓబీసీ తెగల సంక్షేమ విభాగం రాష్ట్ర శాఖ కన్వీనర్ పృథ్వీరాజ్ సాహు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు



విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న కలెక్టర్ సింగ్ తదితరులు

తొక్కిసలాట

కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్నం భోజన విరామ సమయంలో తొక్కిసలాట చోటుచేసుకుంది. ప్రమాదంలో గుణుపూర్ కళాశాలలో ప్లస్ టూ చదువుతున్న మేనకా సొబొరొ అనే విద్యార్థిని ఊపిరాడక కింద పడిపోగా, రాయగడ మహిళా కళాశాలలో ప్లస్‌టూ ఆర్ట్స్ చదువుతున్న దీపాలి నాయక్ అనే మరో విద్యార్థిని వేడినూనె కడాయి వద్ద పడిపోవడంతో ఆమె కాలికు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వీరిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్, రాయగడ తహసీల్దార్ ప్రియదర్శిని స్వయిలు ఆస్పత్రులకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు. కాగా చికిత్స పొందుతున్న విద్యార్థినులను కలెక్టర్ పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు.



ఆకట్టుకుంటున్న సాంస్కృతిక నృత్యాలు



సెల్ఫీల సందడి



రాగులతో తయారు చేసిన వంటకాల ప్రదర్శన

కమ్ముకున్న పొగమంచు



భువనేశ్వర్: భువనేశ్వర్, కటక్ జంట నగరాలు గజగజలాడించే చలి పరిస్థితుల నుంచి స్వల్ప ఉపశమనం పొందుతున్న తరుణంలో దట్టమైన పొగ మంచు ఈ ప్రాంతాలను చుట్టుముట్టింది. బుధవారం ఉదయం దృశ్యమానత తగ్గి సాధారణ జనజీవనం అస్తవ్యస్తమయ్యింది. దట్టమైన పొగమంచు కారణంగా దృశ్యమానత తగ్గినట్లు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సమాచారం. జంట నగరాలతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా పొగ మంచు దట్టంగా కమ్మినట్లు ఐఎండీ పేర్కొంది. దట్టమైన పొగమంచు కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పొగమంచు కారణంగా జంట నగరాల శివారులు, అంతర్గత ఒడిశాలోని కొన్ని ప్రదేశాల్లో వాహనాల రాకపోకలు ప్రభావితమయ్యాయి. భద్రక్, ఖుర్దా, ఢెంకనాల్, చాంద్‌బాలి, పూరీ, గోపాలపూర్, భవానీపట్న, కెంజొహర్, ఝూర్సుగుడ, జగత్‌సింగ్‌పూర్, పారాదీప్ ప్రాంతాల్లో పొగమంచు తీవ్రత ఎక్కువగా కనిపించింది. ఆయా ప్రాంతాల్లో దృశ్యమానత దిగజారి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

ఎల్లో అలెర్ట్

ఝూర్సుగుడ, సుందర్‌గడ్, కెంజొహర్, దేవ్‌గడ్, అంగుల్, ఢెంకనాల్, జాజ్‌పూర్, భద్రక్, కటక్, కేంద్రాపడా, జగత్‌సింగ్‌పూర్, పూరీ, ఖుర్దా, నయాగడ్, గజపతి, గంజాం, కందమాల్, కలహండి, రాయగడ, కొరాపుట్, నవరంగపూర్, బొలంగీర్ జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల దట్టమైన పొగమంచు కురుస్తుందని వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. మరో 24 గంటలపాటు ఈ హెచ్చరిక కొనసాగుతుందని తెలిపారు. 2 రోజుల తర్వాత రాత్రి ఉష్ణోగ్రత 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ తగ్గే అవకాశం ఉందని ఈ కేంద్రం సమాచారం.

పలు ప్రాంతాల్లో తగ్గిన దృశ్యమానత

ప్రాంతం	దృశ్యమానత (మీటర్లు)
ఖుర్దా	20
ఢెంకనాల్	20
చాంద్‌బాలి	40
కటక్	50
భువనేశ్వర్	100
కేంద్రాపడా	100
రౌర్కెలా	100
అంగుల్	100
ఫుల్బాణి	100
పూరీ	200
గోపాలపూర్	200
జగత్‌సింగ్‌పూర్	200
భవానీపట్న	200
పారాదీప్	400
కెంజొహర్	700
ఝూర్సుగుడ	800

ప్రాకార ప్రాజెక్టు పనులపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న సురేష్ చంద్ర మహాపాత్రో

- త్వరలో జగన్నాథ్ ఎక్స్‌ప్రెస్ బస్సు సేవలు

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరం ప్రాకార ప్రాజెక్టు పనుల పురోగతిని ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు సురేష్ చంద్ర మహాపాత్రో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీమందిరం ప్రాకార పథకం ముఖ్యమంత్రి కలల ప్రాజెక్టు అన్నారు. ప్రాజెక్టు పూర్తైన తర్వాత పూరీకి వచ్చే యాత్రికులు అందమైన అనుభూతి పొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

త్వరలో బస్సు సేవలు

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో పూరీ పట్టణానికి జగన్నాథ్ ఎక్స్‌ప్రెస్ బస్సు సేవలను ప్రారంభించనుందని సురేష్ చంద్ర తెలియజేశారు. ప్రభుత్వ లక్ష్మి పథకం కింద దశల వారీగా భక్తులకు పూరీకి బస్సు రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. లక్ష్మి పథకం కింద బస్సు సేవలు ప్రస్తుతం గ్రామ పంచాయతీ నుంచి మండల ప్రధాన కార్యాలయం ప్రాంతానికి అందుబాటులో ఉన్నాయి. తదుపరి దశలో ఈ బస్సు సేవలను జిల్లా ప్రధాన కార్యాలయం ప్రాంతం వరకు విస్తరిస్తారు. దశల వారీగా జిల్లా కేంద్రం నుంచి భువనేశ్వర్ మీదుగా పూరీకి జగన్నాథ్ బస్సు సర్వీసు ప్రారంభమవుతుంది. శ్రీజగన్నాథ్ బస్సు సేవలను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. శ్రీసేతు, జగన్నాథ వల్లభ్ పార్కింగ్ పనులు సజావుగా సాగుతున్నాయన్నారు. ఈనెల 12న యజ్ఞం ప్రారంభం అవుతుంది. 17న పూర్ణాహుతి ఉంటుంది. ఈ దివ్య ఘట్టాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. వారందరూ ఈ సౌకర్యాలను ఉపయోగించుకుని సంతృప్తిని వ్యక్తం చేస్తారని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తుల దాడి



దుండగుల దాడిలో పగిలిన కారు అద్దాలు

- ఐదుగురికి గాయాలు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి కొంటొమాల్ గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని కొంతమంది వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. వీరి దాడిలో ఐదుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. గాయాలైనవారు కాసీపూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనిపై కాసీపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు, బాధితులు తెలియజేసిన వివరాల ప్రకారం .. కాసీపూర్ సరిహద్దు ప్రాంతమైన కలహండి జిల్లాలోని తువామూల్ రాంపూర్ గ్రామానికి చెందిన కొందరు ఒక కారులో తమ సొంత పనులపై కాసీపూర్‌కు మంగళవారం వచ్చారు. అనంతరం వారి పనులు ముంగించుకుని తిరిగి తమ గ్రామానికి వెళ్తుండగా, కొంటామాల్ గ్రామ సమీపంలో కాపుకాసిన దుండగులు కారును ఆపి కారు అద్దాలు పగులగొట్టి దాడి చేశారు. అనంతరం వారి దగ్గర ఉన్నటువంటి నగదు, బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. అయితే అదే సమయంలో కొంటొమాల్ ప్రాంతంలో నెట్‌వర్క్ సమస్య ఉండడంతో తమ బంధువులకు, పోలీసులకు సమాచారం ఇవ్వలేకపోయామని బాధితులు వెల్లడించారు. తమపై దాడి విషయమై బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దుండగుల కోసం గాలిస్తున్నారు.



తమపై జరిగిన దాడిని వివరిస్తున్న బాధితుడు

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- గవర్నర్ రఘుబర్ దాస్

పర్లాకిమిడి: రాష్ట్రంలోని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని గవర్నర్ రఘుబర్ దాస్ ఆకాంక్షించారు. గజపతి జిల్లా గుసాని సమితి పద్మపురం గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో నేరుగా మాట్లాడారు. అనంతరం డ్వాక్రా గ్రూపులు తయారు చేసిన మిల్లెట్స్ తినుబండారాలు, అప్పడాలు, బెత్తం కర్రతో తయారు చేసిన వస్తువులను పరిశీలించారు. మహిళలు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవడమే కాకుండా, తమకు వచ్చిన లాభాలతో పిల్లలను చదివించి ఉన్నత శిఖరాలను అందుకునేలా తీర్చిదిద్దాలని సూచించారు. ఆయనతో పాటు పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణ రావు, కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ ఉన్నారు.



మాట్లాడుతున్న గవర్నర్ రఘుబర్ దాస్



పిండి వంటలను పరిశీలిస్తున్న గవర్నర్



వస్తువుల గురించి అడిగి తెలుసుకుంటున్న గవర్నర్ రఘుబర్ దాస్

క్లుప్తంగా

ఆర్బీకేలో పోయిన వస్తువులు లభ్యం



లభ్యమైన వస్తువులను పరిశీలిస్తున్న ఏఎస్సై కాశీరావు

దత్తిరాజేరు: మండలంలోని వి.కృష్ణాపురం ఆర్బీకేలో పోయిన వస్తువులు మళ్లీ ఆర్బీకే వద్దనే లభ్యమైనట్లు పెదమానాపురం ఏఎస్సై కాశీరావు బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం తెల్లవారు జామున ఆర్బీకే తాళాలు విరగ్గొట్టి టీవీ, కంప్యూటర్ పరికరాలను గుర్తు తెలియని వ్యక్తులు పట్టుకుని వెళ్లిపోవడంతో ఏఈఓ నీలాకృష్ణ ఫిర్యాదు చేశారు. దీంతో భయపడిన అకతాయిలు బుధవారం ఉదయం ఆర్బీకే ముందు వస్తువులను ఉంచారు. వస్తువులు దొరికినా దొంగిలించిన వారిపై నిఘా ఉంచుతామని ఏఎస్సై చెప్పారు.

కెరటాం రైసు మిల్లుపై కేసు నమోదు



రైస్‌మిల్లులో వేబ్రిడ్జిపై తూకం వేసి పరిశీలిస్తున్న అసిస్టెంట్ లీగల్ కంట్రోలర్, అధికారులు

బొండపల్లి: మండలంలోని కెరటాం గ్రామంలో గల మహేశ్వరి రైస్‌మిల్లుపై తూనికలు కొలతల శాఖ జిల్లా అసిస్టెంట్ లీగల్ కంట్రోలర్ పి.వి.రంగారావు వేబ్రిడ్జి కాటాను పరిశీలించి కేసు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ రవిశంకర్ తెలిపారు. లీగల్ మెట్రాలజీ అధికారులు తాము తెచ్చిన తూనికకు సంబంధించిన గుళ్లతో తూకంవేయగా అన్నీ సక్రమంగానే ఉన్నప్పటికీ వేబ్రిడ్జికి వేసే సీళ్లు సక్రమంగా లేకపోవడాన్ని గుర్తించి కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



రైలు కిందపడి మృతి చెందిన నవీన్(ఫైల్)

చీపురుపల్లి: పట్టణంలోని జి.అగ్రహారానికి చెందిన కోట్ల నవీన్ (25) రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం రాత్రి 10 గంటల తరువాత తన ద్విచక్ర వాహనంపై రైల్వేట్రాక్ వరకు వెళ్లి రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం ఈ సమాచారం తెలుసుకున్న ఆమదాలవలస జీఆర్‌పీ ఎస్సై చెల్లూరి శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. నవీన్ చిన్న వయస్సులోనే తల్లిదండ్రులు మృతిచెందారు. ముగ్గురు అన్నదమ్ములు ఉండగా నవీన్‌కు ఇంకా వివాహం కాలేదు. అయితే ఆత్మహత్యకు పాల్పడడం వెనుక కారణాలు తెలియరాలేదు.

సౌత్‌జోన్ కరాటే పోటీలకు జేఎన్‌టీయూ జీవీ జట్లు



ఎంపికైన క్రీడాకారులతో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ

విజయనగరం అర్బన్: ఎల్ఎన్‌సీటీ భోపాల్‌లో ఈ నెల 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ కరాటే టోర్నమెంట్‌లో పాల్గొనే జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) స్త్రీ, పురుషుల జట్ల వివరాలను యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఇటీవల యూనివర్సిటీ అనుబంధ కళాశాల రఘు ఇంజినీరింగ్ కాలేజ్, విశాఖ కళాశాల క్రీడామైదానంలో జరిగిన అంతర యూనివర్సిటీ టోర్నమెంట్‌లో జేఎన్‌టీయూ జీవీ పరిధిలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల క్రీడాకారులు ప్రతిభ చూపడంతో వారంతా జట్లకు ఎంపికయ్యారని పేర్కొన్నారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం



దగ్ధమైన ట్రాక్టర్

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి పొలాల నుంచి ట్రాక్టర్‌తో వరి గడ్డి తీసుకొస్తుండగా బుధవారం సాయంత్రం దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు అప్పికొండ కృష్ణ తన పశువుల మేత కోసం పొలాల నుంచి ట్రాక్టర్‌పై గడ్డి తీసుకువస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి మంటలు వ్యాపించడంతో చుట్టుపక్కల వారు వచ్చి అదుపుచేశారు. అనంతరం బాడంగి అగ్ని మాపక సిబ్బంది వచ్చిన మంటలను ఆర్పినట్లు గ్రామస్తులు తెలిపారు.

హరిలో రంగ హరి..!

- గ్రామాల్లో మొదలైన హరిదాసుల సందడి
- సంతరించుకున్న సంక్రాంతి శోభ
- దశాబ్దాలుగా అక్షయపాత్ర వినియోగం



కురుపాం: తలపై అక్షయ పాత్ర, మెడలో నిలువెత్తు దండ..పట్టు పీతాంబరాలు, ఒక చేతిలో చిడతలు..మరోచేతిలో తంబుర..నుదుటన నామాలు..కాళ్లకు గజ్జెలు..కంచుకంఠంతో విష్ణు నామస్మరణ..నెల రోజుల పాటు పల్లె ముంగిట హరిదాసులు దర్శనమిస్తే సంక్రాంతి పండగ ఆరంభమైనట్లే. పల్లెల్లో తెలతెలవారక ముందే హరిలో రంగ హరి..! అంటూ హరిదాసుల సంకీర్తన ప్రారంభం కావడంతో సంక్రాంతి పండగ శోభ సంతరించుకుంది. సంక్రాంతి పండగ రోజుల్లో పల్లెల్లో సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబిస్తాయి. సంక్రాంతి పండగ ఆగమనాన్ని గుర్తుచేస్తూ హరిదాసులు నెల రోజుల పాటు వచ్చి హరి నామస్మరణ చేస్తూ ప్రతి ఇంటికి వెళ్తారు. కానీ ఎవరి ముంగిట ఎక్కువసేపు నిలవరు. కానుకలు సమర్పించినా సమర్పించకపోయినా హరి నామస్మరణతో ముందుకు సాగిపోతారు. తెల్లవాకుజామున ప్రారంభమయ్యే వారి ప్రయాణం సూర్యుడు నడినెత్తికి వచ్చే వరకూ సాగుతుంది. ఈ సందర్భంగా సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకము రామచంద్రా..అంటూ భద్రాద్రి రామదాసు కీర్తనలు రాగయుక్తంగా ఆలపిస్తారు.

అక్షయ పాత్ర చాలా ప్రధానం

హరిదాసుల నెత్తిపై ఉండే అక్షయ పాత్ర చాలా ముఖ్యమైంది. తెల్లవారుజామున పాత్రను తలపై ధరించిన తరువాత గ్రామ సంచారం పూర్తయ్యేవరకు కిందికి దించబోమని సంవత్సరాలుగా హరిదాసు వృత్తిలో ఉన్నవారు చెబుతున్నారు. ధనుస్సంక్రమణంలో హరిదాసుల అక్షయపాత్రకు ఎంతో ఘనచరిత్ర ఉంది. శ్రీమహావిష్ణువు సూర్య భగవానుడికి అందించిన అక్షయపాత్రకు వనవాస సమయంలో శ్రీకృష్ణుడు ధర్మరాజుకు ఇచ్చాడని పురాణాల్లో పేర్కొన్నారు.

ధర్మరాజు సందేహం నివృత్తి

ధర్మరాజు పట్టాభిషేకం అనంతరం ఈ పాత్ర విషయంలో ధర్మరాజు ధర్మ సందేహాన్ని శ్రీకృష్ణుడు నివృత్తి చేస్తూ సలహా చెప్పాడు. ఒక మంటపానికి వేయి గంటలు కట్టించి, విప్రోత్తములందరినీ పిలిచి అన్న సమారాధన చేయాలని, ఆ సమయంలో ఏకకాలంలో వేయి గంటలు మోగాలని శ్రీకృష్ణుడు ధర్మరాజుకు చెప్పాడు. పై విధంగా చెప్పినప్పటికీ గంటలు మోగకపోవడంతో కృష్ణుడిని పాండవులు ప్రార్థించారు. కృష్ణుడు శ్రీవైష్ణవుని పిలిచి భోజనం చేయమని అర్థించగా స్వయంపాకం కోరాడని, స్వయంగా వండివార్చి, గోదాదేవి సహిత శ్రీకృష్ణ మూర్తికి అర్పణ చేసిన తరువాత వైష్ణవుడు భుజించగా ఆ వేయి గంటలు మోగినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. దీంతో ధర్మరాజు అక్షయ పాత్రను వైష్ణవుడికి ఇవ్వగా అప్పటి నుంచి ఆ పాత్రను ధనుర్మాసంలో తలపై ధరించి విష్ణునామ సంకీర్తనలతో గ్రామ సంచారం చేసే వృత్తిగా సంక్రమించిందని హరిదాసు పిరిడి సింహాచం తెలిపారు. ధనుర్మాసం నెల రోజులూ సూర్యోదయానికి ముందు శ్రీకృష్ణ, గోదాదేవిలకు నివేదన చేసి, తిరుప్పావైపఠించి అక్షయ పాత్రను ధరిస్తామన్నారు. పాత్ర ధరించి గ్రామ సంచారం ప్రారంభమైన దగ్గర నుంచి అక్షయ పాత్ర దించడం కానీ, మాట్లాడడం కానీ చేయరాదని చెప్పారు. ఆధ్యాత్మిక, రామాయణ కీర్తనలు, కృష్ణలీలలను గానం చేస్తూ సంక్రాంతి శోభ పల్లెలకు విస్తరిస్తామని తెలిపారు.

సైనిక్‌స్కూల్ పూర్వ విద్యార్థికి అత్యున్నత పదవి



ఎం.మురళీ మోహన్ రాజు

విజయనగరం రూరల్: కోరుకొండ సైనిక పాఠశాల పూర్వ విద్యార్థి ఎం.మురళీమోహన్‌రాజుకు అత్యున్నత పదవి వరించింది. ఆయన గత కొన్నేళ్లుగా తూర్పు నావికాదళ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. నావికాదళంలో విశేష సేవలు అందించడంతో భారత నావికాదళం నుంచి అనేక పదవులు, ప్రశంసలు, రివార్డులు, బిరుదులు, పతకాలు వరించాయి. ప్రస్తుతం తూర్పు నావికాదళం ప్రధాన కార్యాలయంలో రియర్ అడ్మిరల్ అధికారిగా ఉద్యోగోన్నతి పొందారు. ఆయనకు సైనిక పాఠశాల అధికారులు, ఉద్యోగులు, జిల్లా వాసులు అభినందనలు తెలిపారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



వైద్యశిబిరాన్ని తనిఖీ చేస్తున్న ఆరోగ్య సురక్ష రాష్ట్ర సెకెండరీ హెల్త్ సంచాలకుడు, జేఏఎస్ జిల్లా ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్

- గ్రామస్థాయిలోనే అత్యున్నత వైద్యసేవలు
- జగనన్న ఆరోగ్య సురక్షను తనిఖీ చేసిన ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్

పార్వతీపురం టౌన్: ప్రజల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని జగనన్న ఆరోగ్య సురక్ష రాష్ట్ర సెకెండరీ హెల్త్ సంచాలకుడు, జేఏఎస్ జిల్లా ప్రత్యేకాధికారి ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. పార్వతీపురం పట్టణం చాకలి బెలగాంలో బుధవారం నిర్వహించిన జేఏఎస్-2 వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. జేఏఎస్ ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జేఏఎస్‌కు విచ్చేసిన ప్రజలతో మాట్లాడారు. వైద్యసేవల తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. గర్భిణులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రతీ ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్యసురక్ష కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మందులను కేంద్ర డ్రగ్‌స్టోర్ నుంచి గ్రామ వార్డు సచివాలయానికి సరఫరా చేసి, రోగులకు అందజేస్తున్నట్టు వెల్లడించారు. ప్రతీ మంగళ, శుక్రవారాలు మండలాల్లోను, ప్రతీ బుధవారం పట్టణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు జరుగుతాయన్నారు. గ్రామీణ స్థాయిలోనే ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. మొదటి దఫాలో జిల్లాలో 292 శిబిరాలు నిర్వహించినట్టు తెలిపారు. కంటివెలుగు కార్యక్రమం ద్వారా కళ్ల తనిఖీలను నిర్వహించి అవసరమైన వారికి కేటరాక్ట్ శస్త్రచికిత్స చేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆర్థిక పరిమితిని సైతం రూ.5లక్షల నుంచి రూ.25 లక్షలకు ప్రభుత్వం పెంచిందన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణు చరణ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.బి.జగన్నాథ రావు, జిల్లా ఆస్పత్రి సమన్వయ అధికారి డాక్టర్ బి.వాగ్దేవి, ఆర్డీఎస్‌కే ప్రాజెక్టు అధికారి డాక్టర్ ధవళ భాస్కరరావు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో అందించిన జేఏఎస్-2 సేవలు	
మండలాలు	15
వైద్యశిబిరాలు	3
మొత్తం ఓపీలు	1288
స్పెషలిస్టుల ఓపీలు	597
పీహెచ్‌సీ సిబ్బంది నిర్వహించిన ఓపీలు	579
డీఎం	309
హెచ్‌టీఎన్	334
ఏఎన్‌సీ	33
పీఎన్‌సీ	27
అనీమియా	44
ల్యాబ్‌టెస్టులు	952
ఈసీజీ పరీక్షలు	11
కంటి పరీక్షలు	182
రిఫరల్ కేసులు	5

ఈ నెల 12 వరకు క్లెయిమ్‌ల పరిష్కారం



పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు

పార్వతీపురం: ముసాయిదా ఓటరు జాబితాపై అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను ఈ నెల 12తేదీ వరకు పరిష్కరించనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ అర్.గోవింద రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితాపై 2024 జనవరి 12వ తేదీ వరకు వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిష్కరించనున్నట్లు చెప్పారు. తుదిజాబితాను 22వ తేదీన ప్రచురించనున్నామన్నారు. 25వ తేదీన జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తగా నమోదైన యువ ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులను అన్ని మండల కేంద్రాల్లో అందజేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 1,86,354 ఫారాలు స్వీకరించగా, వాటిలో 1,79,811 ఫారాలు పరిష్కరించి ఓటరు జాబితాలో చేర్చినట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లాలో శాశ్వత సెంటర్లు, మొబైల్ ప్రదర్శన వ్యాన్‌లు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా ఎన్నికల కార్యాలయం, రిటర్నింగ్ అధికారి ప్రధాన కార్యాలయం లేదా రెవెన్యూ సబ్-డివిజన్ అధికారుల వద్ద శాశ్వత సెంటర్లు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మొబైల్ ప్రదర్శన వ్యాన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొబైల్ వ్యాన్ షెడ్యూల్ ముందుగా తెలియజేస్తామని, రాజకీయ పార్టీల ప్రతినిధులు కార్యక్రమంలో ప్రజలను పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, రాజకీయపార్టీల ప్రతినిధులు తామరకండి వెంకటరమణ, వి.శ్రీనివాసరావు, ఎస్.ఉమామేశ్వరరావు, పి.రవికుమార్, పైల శ్రీనివాస్, ఎన్నికల సూపరింటెండెంట్ డి.రవికుమార్, తదితరులు, పాల్గొన్నారు.

2055 రేషన్‌కార్డులు మంజూరు

జిల్లాలో రైస్‌కార్డులు కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన 2055 మందికి కొత్త కార్డులు మంజూరైనట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కార్డులు మంజూరైన లబ్ధిదారులు వారి పరిధిలోని గ్రామ/వార్డు సచివాలయాల్లో కార్డులు పొందాలని సూచించారు. అలాగే రేషన్ పంపిణీ వాహనాలవద్ద జనవరి నెలకు సంబంధించి బియ్యం తీసుకోవాలని చెప్పారు.

గంజాయి కేసులో ముదాయిలకు 15 ఏళ్ల జైలు



గంజాయి కేసులో ముద్దాయిలు

విజయనగరం క్రైమ్: గంజాయి కేసులో ఇద్దరు ముద్దాయిలకు 15 ఏళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తూ ఒకటవ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జి.రజని బుధవారం తీర్పు వెల్లడించినట్లు రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు తెలిపారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. విజయనగరం రూరల్ పరిధిలో రాకోడు- పినవేమలి గ్రామాల మధ్య 2018 ఫిబ్రవరి 19న అప్పటి రూరల్ ఎస్సై పి.రామకృష్ణ వాహన తనిఖీలు చేపట్టగా, గంట్యాడ మండలం నరవ గ్రామంలోని ఏఎంజీ.కాలనీకి చెందిన చలుమూరి గంగునాయుడు, విజయనగరం పట్టణానికి చెందిన పెసల శ్యాంసన్‌లు వేర్వేరు మోటార్ సైకిల్స్‌పై నరవ నుంచి వస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. ఈ సందర్భంగా వారి నుంచి 65 కిలోల గంజాయిని అప్పటి తహసీల్దార్ సమక్షంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై అప్పటి రూరల్ సీఐ డి.లక్ష్మణరావు కేసు దర్యాప్తు చేపట్టి, నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించి, అభియోగపత్రం దాఖలు చేశారు. ఎస్పీ ఎం.దీపిక ఆదేశాలతో ప్రస్తుత రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు ఈ కేసును ప్రాధాన్య జాబితాలో స్వీకరించి, కోర్టు విచారణలో సాక్షులను ప్రవేశపెట్టి ప్రత్యేక శ్రద్ధ వహించడంతో నిందితులపై నేరారోపణలు రుజువయ్యాయి. ఈ కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రవి పోలీసుల తరపున వాదనలు వినిపించారు.

పతకాల పంట

- అంతర కళాశాల పోటీల్లో రాణించిన గరివిడి పశువైద్య కళాశాల విద్యార్థులు

చీపురుపల్లిరూరల్ (గరివిడి):

అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక పోటీల్లో గరివిడి పశువైద్య కళాశాల విద్యార్థులు పతకాల పంట పండించారు. తిరుపతి పశువైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జనవరి 3 నుంచి 7వ తేదీవరకు గన్నవరం పశువైద్య కళాశాలలో 12వ అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక పోటీలు జరిగాయి. వీటిలో కళాశాలకు చెందిన అబ్దుల్ గౌశియాతపస్సుమ్ టెన్నికాయిట్‌లో, ప్రసన్నసాయి ట్రిపుల్ జంప్‌లో విజేతలుగా నిలిచారు. 200, 400 మీటర్ల పరుగుపందెంలో ఎస్.ప్రణీత తృతీయ, ద్వితీయ స్థానాల్లో నిలవగా, 3వేల మీటర్ల పరుగుపందెంలో ఎం.భువనేశ్వరి ద్వితీయ, సౌమ్య తృతీయ స్థానాలను దక్కించుకున్నారు. 5వేల మీటర్ల రన్నింగ్‌లో ఎం.భువనేశ్వరి తృతీయ స్థానాన్ని దక్కించుకుంది. లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్‌లో వి.సాయిపూజిత (ద్వితీయ), హైజంప్‌లో ఎం.కావ్యశ్రీ (తృతీయ), షాట్‌పుట్‌లో శ్రావణి (తృతీయ), జావెలిన్‌త్రోలో ఎ.నవీన్‌కృష్ణ (తృతీయ), క్యారమ్స్‌లో (ద్వితీయ), చదరంగంలో శ్రీచందన్ (ద్వితీయ) సత్తాచూపారు. టీమ్ ఈవెంట్స్ బాస్కెట్‌బాల్, 400 రిలే రన్నింగ్, టెన్నికాయిట్‌లో మహిళలు, బాల్‌బ్యాడ్మింటన్‌లో పురుషులు ద్వితీయ స్థానంలో నిలిచారు. సాంస్కృతిక, సాహిత్య రంగంలో కె.మానససుజాత, లక్ష్మీవైష్ణవి, పి.అంజలి, ఎస్.సృజన, ద్రావణిగౌడ్, నవీన్‌కృష్ణలు ప్రతిభ చూపారు. క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ మక్కేన శ్రీను, అధ్యాపక సిబ్బంది బుధవారం అభినందించారు.

సారా బట్టీలపై విస్తృత తనిఖీలు

- 10 లీటర్ల సారా, ఒక బైక్ స్వాధీనం
- 700 లీటర్ల బెల్లంఊట ధ్వంసం



కొత్తవలస: చిన్నమన్నిపాలెం సమీపంలో సారా తరలిస్తుండగా పట్టుబండిన బైక్,10 లీటర్ల సారాతో సీఐ రాజేశ్వరి తదితరులు



కొత్తవలస: రామలింగాపురం సమీపంలో బెల్లం ఊటను పారబోస్తున్న పోలీసులు



పట్టుకున్న సారా, బెల్లంఊటలను చూపిస్తున్న ఎస్సై వెంకటరమణ, సిబ్బంది

కొత్తవలస: కొత్తవలస స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సీఐ సీహెచ్.రాజేశ్వరి ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం సారా తయారీ, అమ్మకాలపై విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు మండలంలోని చిన్నమన్నిపాలెం జంక్షన్ సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో అదే గ్రామానికి చెందిన బొబ్బాది ముత్యాలు ద్విచక్రవాహనంపై 10 లీటర్ల సారాతో, వేపాడ మండలం బొద్దాం గ్రామంలో నిర్వహించిన తనిఖీల్లో గల్లా రమణ లీటర్ సారాతో పట్టుబడినట్లు సీఐ రాజేశ్వరి తెలిపారు. ఈ మేరకు నిందుతులిద్దరినీ కొత్తవలస కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు చెప్పారు. అలాగే చిన్నమన్నిపాలెం, రామలింగాపురం గ్రామ సమీపాల్లో సారా బట్టీలపై దాడులు నిర్వహించగా పోలీసుల అలికిడి తమనించి తయారీదారులు పరారయ్యారని, సారా తయారీకి సిద్ధంగా ఉంచిన పులిసిన బెల్లం ఊట సుమారు 700 లీటర్లను ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై పి.నరేంద్రకుమార్, సిబ్బంది సీహెచ్.సంతోష్‌కుమార్, జి.మనోజ్, పి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

460 లీటర్ల సారా ధ్వంసం

సాలూరు: మండలంలోని కోడంగివలస శివారు అటవీప్రాంతంలో అక్రమంగా తయారుచేస్తున్న సారా స్థావరాన్ని గుర్తించి 460 లీటర్ల బెల్లంఊట ధ్వంసం చేసినట్లు రూరల్ ఎస్సై వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ, ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో కలిసి కోడంగివలస సమీపంలో సారా స్థావరంపై దాడిచేశామన్నారు. అక్కడ సారాతో పాటు సారా తయారీకి ఉపయోగించే సుమారు 3వేల లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశామని తెలిపారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడపోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



కొత్తవలస: బలిఘట్టం ప్రగతి కళాశాల క్రీడా మైదానంలో వాలీబాల్ పోరులో క్రీడాకారులు

గుర్ల: క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆడుదాం-ఆంధ్రా మండల స్థాయి పోటీలను బుధవారం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. జాతీయ జెండా, ఆడుదాం ఆంధ్రా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడకారుల ప్రతిభను బయటకు తీసి ఉన్నత స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. క్రీడకారులతో కలిసి కాసేపు బ్యాడ్మింటన్, వాలీబాల్ ఆడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.వి. సూర్యనారాయణ రాజు, పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, కెంగువ మధుసూదనరావు, ఎంపీడీఓ కల్యాణి, పీఈటీలు లక్ష్మణరావు, అధికారులు పాల్గొన్నారు.

కాలినడకన సింహాచలంకు...



సింహాచలం దేవస్థానికి పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

ధనుర్మాసంలో భాగంగా సింహాచలంలోని వరహాలక్ష్మినర్సింహ స్వామి దర్శనానికి మూడువేల మంది భక్తులు బుధవారం కాలినడకన వెళ్లారు. కొత్తవలస మండలం మంగళపాలెం గ్రామంలోని గురుదేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులు స్వామివారి దర్శనానికి తరలివెళ్లారు. ఏటా ధనుర్మాసంలో కాలినడకన వెళ్లి అప్పన్నస్వామిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తున్నట్టు ట్రస్టు చైర్మన్ జగదీష్‌బాబు తెలిపారు. ముందుగా మంగళపాలెం గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వరహానర్సింహస్వామి నామస్మరణ, భజనలతో పాదయాత్రగా బయలుదేరారు. స్వామివారిని దర్శించేందుకు వెళ్లిన వారిలో ఒడిశా రాష్ట్రంతో పాటు అల్లూరిసీతారామరాజు జిల్లా, అరకు, పాడేరు, ఎస్.కోటలోని బొడ్డవర, చిలకలగెడ్డ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు ఉన్నారు.

– కొత్తవలస